క్లుప్తంగా

విద్యుత్ కోతలు ఎత్తివేయాలి

కొణిజర్ల: కొద్ది రోజులుగా విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేయాలని పగటి పూట వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ ఈ నెల 31న సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలో చేపట్టిన రైతు ప్రదర్శన, మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలో ఇచ్చిన రుణమాఫీ తక్షణమే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతు రాంబాబు, మండలాధ్యక్షుడు దారగాని రాములు, బోయినపల్లి శ్రీనివాసరావు, మల్లయ్య, ఆదినారాయణ, కొండయ్య, లక్ష్మయ్య, నరసింహారావు, వీరభద్రం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరకాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో కనీసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన గిరిజన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ యూజీ సెట్ ద్వారా మార్చి 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7013999248, 9951755806 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

'పొంగులేటి' ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

ఎర్రుపాలెం: ఈనెల 30న బోనకల్ మండలకేంద్రంలో నిర్వహించనున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళానికి అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బోనకల్‌లో మధిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన అభిమానులు, నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

సమస్యలపై పోరాటాలు నిర్వహించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

చింతకాని: ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరూ పోరాటాలను నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో యోహోషువ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోహోషువ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, నాయకులు షేక్ చిన జాన్, నర్సయ్య, చాట్ల రమేష్, ఎలీషా, మార్కపూడి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసుల పంపిణీ



పాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు రూరల్: న్యూప్రతాప్ ల్యాబ్ అధినేత పెడకంటి రామకృష్ణ ఆర్థికసాయంతో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా ఆర్టీసీ బస్‌పాసులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని రఘునాథగూడెం పంచాయతీలో అర్హులైన దివ్యాంగులకు రాయితీతో కూడిన పాసులను సర్పంచ్ అంజారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చల్లగుండ్ల వెంకటేశ్వరావు, ఆర్టీసీ సిబ్బంది కిన్నెర ఆనందరావు, కంచి శాంసన్ పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం

మధిర: రైతాంగ సమస్యలను పరిష్కరించకుండా రైతులకు తెలంగాణ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, పట్టణాధ్యక్షుడు మల్లాది హనుమంతరావు ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 24 గంటల పాటు కరెంటు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం 10 గంటలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పుల్లారావు, వీరమాచినేని నాగ సులోచన, శివాజీ, నాగేశ్వరరావు, చట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అధ్వానంగా మేజర్ కాల్వ

- పూడిపోవడంతో చివరి భూములకు అందని నీరు
- ఎండిపోతున్న పొలాలు
- ఆందోళనలో రైతులు



ముళ్లపొదలతో పూడుకుపోయిన ఆరికాయలపాడు మేజర్‌కాల్వ

ఏన్కూరు: ఆరికాయలపాడు మేజర్ కాల్వ అధ్వానంగా తయారై కాల్వ మొత్తం పూడిపోయింది. ముళ్లపొదలు, చెత్తాచెదారంతో పూడుకుపోవడంతో చివరి భూములకు నీరు అందడం లేదు. దీంతో కాల్వ రెండు పక్కల రహదారి కూడా గుంతల మయం కావడంతో రైతులు పొలాలకు ఎరువులు, మందులు, పండించిన పంటలు తీసుకెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పీకె బంజర, కొదండరామాపురం తండా గ్రామాల మధ్య ఉన్న ఎన్నెస్పీ కాల్వ 42 కిలోమీటర్ల నుంచి ఆరికాయలపాడు మేజర్ కాల్వ ప్రవాహిస్తుంది. సుమారు 14 కిలోమీటర్లు ఈ కాల్వ ఉంది. పీకే బంజర, రాజలింగాల, బురదరాఘవాపురం, లచ్చగూడెం, శ్రీరాంగిరి, ఆరికాయలపాడు గ్రామాల్తో పాటు కొణిజర్ల మండలం అంజనపురం, గద్దలగూడెం గ్రామాల వరకు ఆరికాయలపాడు మేజర్ కాల్వ ప్రవాహిస్తుంది. దీని కింద 1,150 ఎకరాల మాగాణి, 500 ఎకరాల వరకు సుబాబుల్ సాగవుతుంది. కాల్వ పూడిపోవంతో చివరి భూములకు నీరు అందడం లేదు.

రెండు, మూడు సార్లు దమ్ము చేయాల్సిన పరిస్థితి..

కాల్వ నిండి చెత్తాచెదారం, ముళ్లపొదలు పెరిగి అధ్వానంగా ఉండడంతో నీరు కాల్వ చివరి వరకు ప్రవాహించడం లేదు. దీంతో రైతులు వరిపొలాలకు నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు వచ్చినపుడు దమ్ములు చేసుకున్న రైతులు నాట్లు వేసే సమాయానికి నీరు లేక మరల దమ్ము చేయాల్సి వస్తోంది. ఇలా ఒక్కో రైతు వరి నాట్లు వేసే సమయానికి రెండు, మూడు సార్లు దమ్ములు చేయల్సి వస్తుంది. దీంతో రైతులు అదనపు పెట్టుబడులు అవుతున్నాయి. సుమారు 500 ఎకరాల వరకు చివరి భూములకు నీరు అందడం లేదు.

పట్టించుకోని అధికారులు..

కాల్వ వచ్చినప్పటి నుండి ఇప్పటికీ దీని నిర్వహణ బాధ్యతలు అధికారులు చేపట్టలేదు. ఎన్నెస్పీ అధికారులు వచ్చి ఈ కాల్వను పరిశీలించడం లేదు. రైతులు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన ఎవరు స్పందించడం లేదు. కాల్వ కట్టలపై రహదారులు అధ్వానంగా ఉన్నాయి. సాగు చేసిన రైతులు పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడిపోయిన ఆరికాయలపాడు మేజర్ కాల్వకు మరమ్మతులు చేయాలని. కాల్వకట్టపై ఒక వైపు అయిన రహదారి భాగు చేయాలని రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

కాల్వ మొత్తం పూడిపోయింది



ఆరికాయలపాడు మేజర్ కాల్వ 14 కి.మీలో ప్రవాహిస్తోంది. కాల్వ మొత్తం ముళ్లపొదలు చెత్తాచెదారంతో పూడుకుపోయింది. దీంతో చివరి భూములకు నీరు అందడం లేదు. కాల్వ కట్ట రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పొలాలకు ఎరువులు, మందులు తీసుకెళ్లాలన్న, పండించిన పంటలు తీసుకు రావాలన్నా ఇబ్బందులు పడుతున్నాం.

– భట్టు హనుమంతు రెడ్డి, రైతు, ఆరికాయలపాడు

అధికారులు పట్టించుకోట్లేదు



వరినాట్లు వేసేందుకు దమ్ము చేశాను. నారు తీసుకువచ్చి వేద్దామనుకునే లోపు ఎండిపోవడంతో మరల దమ్ము చేసా. ఎకరానికి దమ్ము చేయలంటే రూ.6 వేలు అవుతుంది. కాల్వ పూడిపోవడం వలన చివరి భూములకు నీరు రావడం లేదు. పంటలకు నీరు కావలసిన సమయంలో నీరు అందడం లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– ఇమ్మడి శ్రీను, రైతు

కార్యకర్తల కుటుంబాలకు భరోసా



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిరూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ సభ్యుల కుటుంబాలకు పార్టీ భరోసాగా నిలిచే కార్యక్రమాన్ని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలపరిధిలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన హెచ్చు వెంకటేశ్వరరావు మరణించగా పార్టీ సభ్యత్వం ఉండటంతో మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును క్యాంపు కార్యాలయంలో ఆదివారం మృతుని భార్య జయమ్మకు అందచేసి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇలాంటి పథకాలు కేవలం ఒక తెలంగాణ రాష్ట్రంలోనే అమలు కావడం ప్రజల అదృష్టమన్నారు. వీటితో పాటు రైతు బీమా పథకం రైతుల కుటుంబాలకు ఎంతో మేలు కల్పిస్తుందన్నారు. బీఆర్ఎస్ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ కూసంపూడి రామారావు, దొడ్డా శంకర్‌రావు, యాగంటి శ్రీనివాసరావు, మట్టా ప్రసాద్, కంచర్ల నాగయ్య, ఏగోటి పెద్దిరాజు, దేవరపల్లి సత్యనారాయణ, పరిమి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోండి



పుస్తకాలు అందజేస్తున్న పాపారావు

వైరా: చదువు మధ్యలో మానేసిన ఓపెన్ స్కూల్ విధానం ద్వారా చదువుకుని సద్వియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు అన్నారు. వైరాలోని ఠాగూర్ విద్యాలయంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను ఆదివారం ఆయన సందర్శించి నూతన అభ్యాసకులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ సంక్రాంతి రవికుమార్, ప్రిన్సిపల్ కృష్ణారావు, లింగారావు, ముకుందరావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: ఓపెన్ స్కూల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ తరగతులను ఆయన పరిశీలించారు. జిల్లాలో 24, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 29 స్టడీ సెంటర్ల ద్వార 3320 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టడీ కో ఆర్డినేటర్లు బాలస్వామి, శంకర్ పాల్గొన్నారు.

'యాత్ర'ను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మానవతారాయ్

తల్లాడ: నియోజకవర్గంలో వచ్చే నెల 4నుంచి 6 వరకు హాత్ సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికోటూరి మానవతారాయ్ అన్నారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఆదివారం జోడో అభియాన్ పాదయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సత్తుపల్లి మండలం రామానగరం భూత్ నెంబర్ 225 నుంచి నియోజకవర్గంలోని మొత్తం 286 భూతుల్లో హాత్ జోడో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల అనంతరం ఫిబ్రవరి 6న ప్రారంభమయ్యే రేవంత్‌రెడ్డి పాదయాత్రకు సత్తుపల్లి నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడపా అనిల్ చౌదరి, చల్లా ఆదినారాయణ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భూక్యా శివకుమార్, ఐ.కృష్ణ, బాజి, కిన్నెర శ్రీనివాస్, శ్రీకాంత్, భరత్ బాబు, లక్ష్మణ్‌రావు, పుల్లారావు, సాగర్, వీరభద్రం పాల్గొన్నారు

అమరుల త్యాగాలు మరువలేనివి



మాట్లాడుతున్న ప్రసాద్

కొణిజర్ల: పేద ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని అలాంటి త్యాగాలు వృథా కావని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని రామనర్సయ్యనగర్‌లో శనివారం రాత్రి యాసా శ్రీను వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యాసా శ్రీను సమాధి వద్ద పూల మాలలేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ... కార్మిక కర్షక, రైతాంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారం చేపట్టిన ప్పుడే అమర వీరులకిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ సభలో దొండపాటి రమేష్, వేములకొండ రమేష్, తమ్మినేని వెంకటేశ్వర్లు, బాణోత్ భరత్, ఆనందరావు, లక్ష్మీనారాయణ, రాంబాబు, వెంకన్న, శ్రీను, ముత్తయ్య, శోభన్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి పరామర్శ..



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు: మండల పరిధిలోని రేపల్లెవాడలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిగా గోళ్ల బేబి కుటుంబాన్ని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముక్తి వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి నరేష్, స్వర్ణ ప్రహ్లాదరావు, వాసిరెడ్డి నాగేశ్వరావు, నల్లమల శివకుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చినజీయర్ స్వామికి అభినందనలు

సత్తుపల్లిరూరల్: పద్మభూషణ బిరుదు పొందిన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారిని ఆదివారం విజయవాడలో విజయకీలాద్రిపై సత్తుపల్లికి చెందిన ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య కలిసి అభినందనలు తెలిపారు. చిన్నజీయర్ స్వామివారి శిష్యుడు రామకృష్ణమాచార్యులను నూతన వస్త్రాలతో మంగళశాసనాలు అందించారు. అభినందనలు తెలిపిన వారిలో కృష్ణ స్వామి, నాగేంద్రమ్మ, గీత, రామారావు, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ భవనం ప్రారంభం



నందినిని సన్మానిస్తున్న పరిషత్ సభ్యులు

మధిర: మధిర పట్టణంలోని శివాలయం సమీపంలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం భవనాన్ని ఆదివారం బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు వేమవరపు వెంకటేశ్వర శర్మ, సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని విక్రమార్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెను బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దారా బాలరాజు, బొమ్మకంటి హరిబాబు, ఆదిమూలం శ్రీను, బ్రాహ్మణ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సాయం

మధిర: ప్రతి ఒక్కరూ సమాజ సేవకు కృషి చేయాలని మధిర పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి దేవిశెట్టి రంగారావు తెలిపారు. సామాజిక సేవా కార్యకర్త లంకా కొండయ్య బృందానికి ఇంట్లో ఉన్న అదనపు దుస్తులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొండయ్య ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకును ఏర్పాటు చేసి ప్రజల వద్ద అదనంగా ఉన్న పాత దుస్తులను సేకరించి నిరుపేదలకు సాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు శ్యామ్, పండు, గోపి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దయానంద్ కోలుకోవాలని ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న కరుణాకర్ తదితరులు

సత్తుపల్లిటౌన్: అస్వస్థతకు గురై హైద్రాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ మట్టా దయానంద్ కోలుకోవాలని సత్తుపల్లిలోని క్రీస్తు సంఘం ప్రార్థనామందిరంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనిల్, భాస్కర్ రావు, ప్రభాకర్, వసంతకుమార్, జార్జ్, కుమార్, నవకుమార్, నాగేశ్వరరావు, శ్రీహరి, ఏసుపాదం పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పారిశుద్ధ్యం కరువు



మండల పరిధిలోని వనంవారికిష్టాపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణ చుట్టు పారిశుద్ధ్యం కరువై చెత్త దంపింగ్‌యార్డులాగా కనిపిస్తోంది. గ్రామంలో ప్రతీ వీధిలో చెత్తా చెదారం తొలగించి పారిశుద్ధ్యం నిర్వహించే అధికారులు ఆ సంగతి మరచారు. కార్యాలయం వెనుక ఖాళీ అట్టపెట్టెలు అవసరం లేని సామగ్రితో అధ్వానంగా ఉంది. చెత్తాచెదారంతో నిండుకుని ఉండటంతో కార్యాలయానికి రావాలంటేనే ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీధులతోపాటు, కార్యాలయం చుటూ ఉన్న ప్రదేశాలను చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : దామోదర్, పంచాయతీ కార్యదర్శి, వనంవారికిష్టాపురం
సెల్ నంబర్ : 8978774386.

ప్రజల వద్దకు ఆర్టీసీ సేవలు



వైరారూరల్: అవగాహన కల్పిస్తున్న దేవదానం

వైరారూరల్: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోని సురక్షితంగా తమ గమ్యాలకు చేరాలని మధిర డిపో మేనేజర్ ఎస్. దేవదానం సూచించారు. మండలంలోని తాటిపూడి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ తక్కువ రాయితీ ఛార్జీలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఏ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు రూరల్: మాట్లాడుతున్న డిపో సీఐ అలీ

ఆర్టీసీని ఆదరించండి..

కల్లూరు రూరల్: ఆర్టీసీని ఆదరించాలని సత్తుపల్లి డిపో సీఐ అలీ కోరారు. ఆదివారం కల్లూరు మండల పరిధిలోని పేరువంచ పంచాయతీలో జరిగిన ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రయాణికుల సౌకర్యార్థం సత్తుపల్లి నుంచి తిరుపతికి ప్రతీరోజు మధ్యాహ్నం 3గంటలకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి వెంకటనర్సిరెడ్డి, నరసింహారావు, అశోక్, వెంకటేశ్వరావు, రామకృష్ణ, మహేష్‌రెడ్డి, నాగయ్య, ఆర్టీసీ సిబ్బంది ఆనందరావు, శాంసన్, రత్నాకర్ పాల్గొన్నారు.

శరవేగంగా 'సొసైటీ' పనులు

- రూ. 80 లక్షలతో పీఏసీఎస్, గోదాంల భవన నిర్మాణాలు
- 65 ఏళ్ల తర్వాత సొంత స్థలం, కొత్త భవనాల ఏర్పాటు
- ఎమ్మెల్యే సండ్ర కృషితో నాబార్డు నిధులు



కల్లూరులో నిర్మిస్తున్న నూతన సొసైటీ, గోదాముల భవనాలు

కల్లూరు: 65 ఏళ్ల తర్వాత కల్లూరు విశాల సహకారం పరపతి సంఘానికి స్థలం, నూతన భవనాలకు నాబార్డు నిధులు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. దీంతో కల్లూరు సొసైటీకి అద్దె భవనాల్లో ఉంటే సమస్య తొలగిపోయింది. 1958, సెప్టెంబర్ 21న కల్లూరులో ప్రారంభమైన సొసైటీకి ఇంత వరకు స్వంత స్థలం లేకపోవడంతో అద్దె భవనాలలోనే నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఉండేది. కల్లూరు సొసైటీ చైర్మన్‌గా బోబోలు లక్ష్మణరావు వచ్చిన తర్వాత సమస్యను ఎమ్మెల్యే సండ్ర దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించి నాబార్డు నిధులు మంజూరుకు కృషి చేశారు. దీంట్లో సొసైటీ కాంట్రీబ్యూషన్ రూ.12 లక్షలు ఉండగా రూ.68 లక్షలు నాబార్డు నుంచి అందాయి. సొసైటీ భవనంతో పాటు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సొసైటీ 13 గ్రామ పంచాయతీల పరిధిలో 9 రెవెన్యూ గ్రామాలు, 22 గ్రామాలు ఉన్నాయి. కల్లూరు, బత్తులపల్లి, కప్పలబంధం, పుల్లయ్యబంజర్, తూర్పు లోకవరం, పడమర లోకవరం, కిష్టయ్య బంజర్, హనుమాతండా, పాయపూర్, ముచ్చవరం, యజ్ఞనారాయణపురం, ఓబులరావు బంజర పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 10,487 మంది సభ్యులు ఉండగా 1,552 మంది రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు. టర్నోవర్ వచ్చేసి ఏడాదికి రూ. 9 కోట్లు ఉంది. ఈ సొసైటీ ఖరీఫ్‌లో ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1,300 మంది రైతుల నుంచి 1,00,400 క్వింటాళ్ల ధాన్యం సేకరించి రూ.20.68 కోట్ల మేరకు రైతుల ఖాతాలో నగదు జమ చేసింది. ప్రతీ ఖరీఫ్, రబీ పంటల సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. రైతులకు ఎరువులు, విత్తనాలు రాయితీ పై అందచేస్తూ రైతుల సేవలో కల్లూరు సొసైటీ అభివృద్ధి చెందింది.

ఎమ్మెల్యే సండ్రకు కృతజ్ఞతలు



65 సంవత్సరాల నుంచి అద్దె భవనాలలో ఉంటున్న కల్లూరు సొసైటీకి నిధులు మంజూరు కావడంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మెన్ కూరాకుల నాగభూషణంల కృషి, ౘొరవ ఎంతగానో ఉంది. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు కృషి చేసారు. ప్రభుత్వం స్థలం 10 కుంటలతో పాటు రూ. 80 లక్షలు మంజూరు అయ్యేలా చేసారు. ఎమ్మెల్యేకు, డీసీసీబీ చైర్మెన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు సొసైటీ తరపున చెబుతున్నాం.

– బోబోలు లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్